

వరద నీటిలోనే లంక గ్రామాల రహదారులు

ప్రజాశక్తి - మామిడికుదురు

గోదావరి వరద తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతుండడంతో పాశర్లపూడి కరకట్ట దిగువన అప్పనపల్లి కాజ్ వే శుక్రవారం వరద నీటిలో మునిగిపోయింది వరద నీటిలో ధ్వంసమైన రోడ్డు గోతులలో వరద నీటిలో వాహన దారులు అవస్థలు పడుతున్నారు. 15 రోజుల నుంచి వరద ప్రవాహం ఎక్కువగా ఉండటంతో కన కాయలంక, అయోధ్య లంక, ఊడి మూడి లంక, జి.పెదపూడిలంక, రావిలంక ప్రాంతాలవాసు లు నాటు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. వరుస వరదలతో ప్రజలు సతమతమవుతున్న పాలకులకు పట్టడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


అప్పనపల్లి కాజ్ వే వద్ద వరద నీటి ప్రవాహం

ఉపాధి లేని ఆటో డ్రైవర్లు

- ఉచిత బస్సుతో ఆటోలు వెలవెల
- కుటుంబాల పోషణకు అవస్థలు
- జీవన భద్రత కల్పించాలని డిమాండ్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వాల నుంచి ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో అనేక మంది స్వయం ఉపాధి మార్గాల వైపు మళ్లారు. వివిధ రకాల ఉద్యోగ, వ్యాపారాలు సాగిస్తూ జీవనం సాగిస్తున్నారు. కాస్తో కూస్తో సంపాదించుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ కోవలోకి ఆటో డ్రైవర్లు కూడా వస్తారు. తమ కాళ్ళపై తాము నిలబడేందుకు ఆటోలను కొనుగోలు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు సైతం ఆటో నడుపుకుంటూ జీవన భృతి పొందుతున్నారు. ఒక వైపు ఫైనాన్స్ కట్టుకుంటూనే మరోవైపు తమ భార్యా పిల్లలను పోషించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కూటమి సర్కారు తమ సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 'స్త్రీశక్తి' పథకాన్ని గత నెల 15 నుంచి అమలు చేస్తోంది. దీంతో తమ ఉపాధి పూర్తిగా దెబ్బతిందని డ్రైవర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజంతా ఆటో నడిపితేనే గానీ పూట గడవని పరిస్థితుల్లో వారు ప్రస్తుతం కొట్టుమిట్టాడుతున్నారు.

జిల్లాలో 30 వేల మందికి పైనే జీవనం

జిల్లాలో ఆటోలు నడుపుకుంటూ 30 వేల మందికి పైనే కార్మికులు తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. సరాసరి ఒక్కో మండలంలో 1500 మంది చొప్పున ఆటో డ్రైవర్ కమ్ ఓనర్‌గా జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు లేక అనేకమంది విద్యార్హత ఉన్నవాళ్లు కూడా ఆటోలను నడుపుకుంటూ జీవిస్తున్నారు. వివిధ ఫైనాన్స్ సంస్థలలో రుణాలు పొంది నెల నెలా వాయిదాలు పద్ధతిలో చెల్లిస్తూ వ్యాపారం చేస్తున్నారు. రోజంతా కష్టపడి నడిపితే ఆయిల్ ఖర్చులు పోను రూ.800 నుంచి రూ.1200 వరకూ సంపాదించుకుంటున్న పరిస్థితి. ఉచిత బస్సు పథకం అమలు తర్వాత సగానికి వ్యాపారం పడిపోయిందంటూ పలువురు ఆటో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కే వారు లేక నిరాశ చెందుతున్నారు. ప్రయాణికుల కోసం ఎదురు చూస్తున్నప్పటికీ నిరాశ తప్పడం లేదంటూ ఆందోళన చెందుతున్నారు. నెల నెలా ఫైనాన్స్ కట్టుకోవడం, కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందంటూ కన్నీరు పెట్టుకుంటున్నారు.


కాకినాడలో ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు

జీవన భద్రత కల్పించాలని డిమాండ్

వ్యాపారం కోల్పోయిన నేపథ్యంలో తమకు జీవన భృతి కల్పించాలని ఆటో కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ ఆటో డ్రైవర్లు నిరసన గళం వినిపిస్తున్నారు. ఇటీవల కాకినాడ జిల్లా కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లంతా పెద్ద ఎత్తున ప్రదర్శన చేసే కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అధిక సంఖ్యలో ఆటో కార్మికులు పాల్గొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆటోలకు ముఖ్య ప్రయాణికులు మహిళలే కావడంతో వ్యాపారం పూర్తిగా దెబ్బతిందని ఈ సందర్భంగా వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా కొత్త విధానం తీసుకుని వచ్చేటప్పుడు దాని ప్రభావం ఎలా ఉంటుందో ముందుగానే ఆలోచించి నిర్ణయం తీసుకుంటే తాము ఇలా రోడ్లమీద పడే వాళ్ళం కాదంటూ చెబుతున్నారు. తమకు జీవన భద్రత కల్పించాల్సిన బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని కోరుతున్నారు. ఆటోకు ఇంధనం వేయించి నెలకు రూ.26 వేలు చెల్లిస్తే ప్రభుత్వ నిబంధనలకు లోబడి రోజుకు 8 గంటలు పాటు మహిళలను తమ గమ్యస్థానాలకు ఉచితంగా చేర్చడానికి సిద్ధంగా ఉన్నామని డ్రైవర్లు తెలిపారు.



ఎక్కే వారి కోసం ఎదురుచూపులే

ఆటో ఎక్కే ప్రయాణికులు బాగా తగ్గిపోయారు. ఆటోలకు డిమాండ్ తగ్గిపోయింది. గతంలో రోజుకి రూ.1000 సంపాదించే వాడిని. పథకం అమలు తర్వాత రూ.400 మించి రావడం లేదు.ఈయంఐలు చెల్లించడం, కుటుంబ పోషణ కష్టంగా మారింది. ప్రభుత్వం మాకు జీవన భృతిని కల్పించి ఆదుకోవాలి.

- పిల్లి పరంధామశెట్టి, ఆటో కార్మికుడు, కాకినాడ



ఉపాధి లేక రోడ్డున పడ్డాం

మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల ఉపాధి లేక రోడ్డున పడ్డాం. ఆదాయం పడిపోవడంతో ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాం.అప్పుల పాలై వడ్డీలు కట్టలేకపోతున్నాం. డ్రైవర్‌కు నెలకు రూ.5 వేలు పింఛన్ ఇవ్వాలి, పెట్రోల్, డీజిల్‌పై సబ్సిడీ ఇవ్వాలని కోరుతున్నాం.

- నులుకుర్తి సూర్య ప్రకాష్, ఆటో డ్రైవర్, కాకినాడ.

ఒప్పందాలను రద్దు చేసుకోవాలి

- నేడు అమెరికా అధ్యక్షుడు టారిఫ్ పెంపునకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు
- సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న కారెం వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - అమలాపురం

తక్షణం కేంద్ర ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న ఒప్పందాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వ రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ప్రకటించడాన్ని తక్షణం వెనక్కి తీసుకోవాలని, అమెరికా సుంకాలపై ప్రధాని మోడీ నోరు మెదపడం లేదని ఇవి భారత వ్యవసాయ రంగాన్ని వాణిజ్య వ్యవస్థను కుదేలు చేస్తుందన్నారు. శుక్రవారం సిపిఎం జిల్లా కార్యాలయం గొల్లగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమెరికాతో చేసుకున్న వాణిద్య ఒప్పందాలు మన దేశ ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడుతుందనానరు. ఆక్వా, టెక్స్టైల్స్, గార్మెంట్స్ వంటి ఉత్పత్తుల ధరలు ఘోరంగా పడిపోయాయని అన్నారు. దేశ సముద్ర ఉత్పత్తుల్లో 40శాతం ఎగుమతులు ఆంధ్రప్రదేశ్ నుండి అవుతున్నాయి. మన ఎగుమతులపై సుంకం పెంచి మరోవైపు అమెరికా నుంచి వ్యవసాయ ఉత్పత్తుల్ని పన్నులు లేకుండా దిగుమతి చేసుకోవాలని, రష్యా నుండి ఆయిల్ కొనుగోలు ఆపాలని షరతులు పెడుతుందని ఇది సబబు కాదని ఎద్దేవా చేశారు. అమెరికా వీసాలకు నిబంధనలు కఠినతరం చేయడం, కాలపరిమితిని తగ్గించడం, జరిమానాలు విధించడం వంటి కారణాలతో ఎన్నో ఆశలతో ఉన్నత విద్యనభ్యసించిన విద్యార్థుల కలలు పేకమేడల్లా కూలిపోతున్నాయనీ వాపోయారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు టిడిపి కూటమి కూడా ఏమాత్రం ప్రయత్నించకపోవడం సరికాదన్నారు. మన దేశ ప్రయోజనాలు కాపాడేందుకు, సార్వభౌమత్వ పరిరక్షణ కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలబడాలని డిమాండ్ చేస్తూ అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సెప్టెంబర్ 6న నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని వామపక్ష పార్టీలు పిలుపు నిచ్చాయని అన్నారు. అందులో భాగంగా ఈనెల 6న శనివారం జిల్లాలో జరిగే నిరసన కార్యక్రమా లు అన్నింటిలోనూ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఆశా వర్కర్లు పోరాడాలి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఆశా వర్కర్ల సమస్యలపై ఐక్యంగా పోరాడి సాధించాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మలక సుభాషిని పిలుపు నిచ్చారు. గొల్లవిల్లిలో శుక్రవారం ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బీర ఎస్తేరు రాణి అధ్యక్షతన ఆశా వర్కర్ల యూనియన్ సమావేశం సిఐటియు నాయకురాలు పి.బేబీగంగారత్నం ఆధ్వర్యంలో నిర్వహించారు.అనేక పోరాటాల ఫలితంగా ఆశా వర్కర్లకు ఆరు నెలలు మెటర్నటీ సెలవు, ఉద్యోగ విరమణ ప్రయోజనాలు, ఉద్యోగ విర మణ వయసు 62 సంవత్సరాలు సాధించుకు న్నామని అన్నారు. రానున్న రోజుల్లో ఆశా వర్కర్లకు వేతన పెంపు, టిఎ, డిఎ తదితర డిమాండ్లపై ఐక్యంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. మండల స్థాయిలో ఆశా వర్కర్లు నాయకత్వ బాధ్యత తీసుకోవాలని కోరారు. ఆశా వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలుగా ఆదిలక్ష్మి, కార్యదర్శిగా మేకల బాలవేణి, కోశాధికారిగా విజయలక్ష్మి తో పాటు మరో నలుగురితో కమిటీని ఏర్పాటు చేశారు.


గొల్లవిల్లిలో ఆశా వర్కర్ల యూనియన్ సమావేశం

రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ అన్నపూర్ణకు సత్కారం

ప్రజాశక్తి - రామచంద్రపురం


ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టిడిపి బిసి సెల్ కార్యవర్గ సభ్యులు పెంకే సాంబశివరావు సతీమణి పెంకే అన్నపూర్ణ ఎపి రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ద్రాక్షారామ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు, హసన్ బాద గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో పరిషత్ సభ్యులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సతీష్‌రావు మాట్లాడుతూ మన ప్రాంతానికి చెందిన పెంకే అన్నపూర్ణను నాటక అకాడమీ డైరెక్టర్ గా నియమించిన సిఎం చంద్రబాబుకు , మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.నాటక రంగ అభివద్ధికి డైరెక్టర్ గా నియమితులైన అన్నపూర్ణ గారు తగిన సహాయ సహకారాలు అందిస్తారని ఆశిస్తున్నామని, సాంబశివరావు గారు నాటక రంగం మీద అభిరుచి కలిగినవారనిసతీష్‌రావు పేర్కొన్నారు. సాంబ శివరావు, అన్నపూర్ణ మాట్లాడుతూ నాటక రంగ అభివద్ధికి కృషి చేస్తామని తెలియజేశారు. కార్యక్ర మంలో పరిషత్ కోశాధికారి వేమవరపు రాంబాబు,బుర్రకథ కళాకారులు గరగ బాబూరావు, వాడ్రేవు వెంకటరావు, పరిషత్ ఆహ్వాన కమిటీ సభ్యులు బిఎల్.నారాయణ, టి.సతీష్, ఎ.బుజ్జి పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనవారికి అవార్డులు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులుఅర్పించారు. **అమలాపురం:** ఉపాధ్యాయులు జీవిత మార్గదర్శకులు సమాజ నిర్మాణ శిల్పులని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా స్థాయిలో గురుపూజోత్సవ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు 64 మందిఉపాధ్యా యులకు శాలువాలు కప్పి, సన్మాన పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంఓ డిఆర్ఓ కొత్త మాధవి, డిఇఓ షేక్ సలీం బాషా, డిసిఎంఎస్ ఛైర్మన్ పి.రామచంద్రరావు, ఎపిసి జి.మమ్మీ, జడ్పిటిసి సభ్యుడు పి.హరిరామ్‌గోపాల్, డిసిసిబి సభ్యులు బి.హనుమంతరావు, డిఎస్ఓ జివిఎస్.సుబ్రహ్మణ్యం, సిఎంఓ సుబ్రహ్మణ్యం, ఉప విద్యాశాఖ అధికారు లు తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట:** స్థానిక కాంతి భారతి విద్యాసంస్థలో నిర్వహించిన గురుపూ జోత్సవానికి ఎంఎల్ఎ బండారు సత్యానందరావు హాజరై మాట్లాడుతూ కొత్తపేట పరిసర ప్రాంతాల్లో కాంతి భారతి విద్యా సంస్థల సేవలు ప్రశంసించదగ్గవన్నారు. అనంతరం ఎంఇఓ హరి ప్రసాద్ తో పాటుగా పలువురు ఉపాధ్యాయులను ఎంఎల్ఎ సత్కారించారు. కార్యక్రమంలో బూసి జయలక్ష్మి భాస్కరరావు, కంఠంశెట్టి శ్రీనివాస్, గనిశెట్టి వీరేష్, విల్లా మారుతీ, బయ్యే రాంబాబు తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం:** పట్టణంలోని మోడరన్ విద్యాసంస్థల్లో అధినేత డాక్టర్ లయన్ జివి.రావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకష్ణ విగ్రహానికి జివి.రావు, మోడరన్ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణ జీవిత చరిత్రకు సంబంధించిన, చిత్రాలతో కూడిన పుస్తకాన్ని జివి.రావు విడుదల చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా సర్వేపల్లి విగ్రహానికి నమస్కరించి గురుపూజ నిర్వహించారు. అనంతరం జివి.రావు మాట్లాడుతూ సర్వేపల్లి ఆశయ సాధనకు విద్యార్థులు కృషి చేయా లన్నారు. కార్యక్రమంలో ఇంటర్ ప్రిన్సిపల్ సిహెచ్.రాజేష్ మోడరన్ స్టాఫ్,విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని ఎంపిపి అంబటి భవాని అన్నారు. స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాల, ద్రాక్షారామంలో ఆదివారపుపేటకు చెందిన కాలెపు నాగరత్నం కాలెపు నరసింహరావు దంపతులు బహూకరించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్నిపాఠశాల ఏర్పడి 25 సం. అయిన సందర్భంగా ఆ విష్కరించారు. ఈ పాఠశాలలో 2002 - 2009 మధ్య చది విన దాత కుమారులు ఉన్నత స్థాయి లో వున్నారని అడగగానే రూ.15, వేల ఖర్చుతో విగ్రహం ఏర్పాటు చేసినందుకు స్టాఫ్ సెక్రటరీ అరవ విస్సు దాత కుటుంబానికి కతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు ప్రసన్నకుమార్, వైస్ ఎంపిపి నరాల రాజ్యలక్ష్మి, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉపసర్పంచ్ బుచ్చిరాజు, గేజెటెడ్ ప్రధాన ఉపాధ్యాయులు పెరిచర్ల శేఖర్, చైర్మన్ కోన నాగ జ్యోతి తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం రూరల్ :** అమలాపురం శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కరాటం మనోహర్‌ను తాండవపల్లి, బండారులంక సర్పంచులు గంగుమళ్ళ ఏసుబాబు, పెనుమాల ఏడుకొండలు కళాశాలలో జరిగిన ఉపాధ్యా య దినోత్సవం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మనోహర్ ఇటీవల జరిగిన పిజిఇసెట్ ఫలితాలలో భౌతిక శాస్త్రంలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించినందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎఓ కరాటం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో గురుపూజ దినోత్సవాన్ని విద్యార్థులు అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.మనోహర్, కరస్పాండెంట్ కె.వి.ఆర్ నరసింహరావు, వైస్ చైర్మన్ కరాటం ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు. తెలుగు భాషోపాధ్యాయులుగా గత 16 సంవత్సరాలుగా తన కర్తవ్య నిర్వహణను నిర్వర్తిస్తూ ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నందుకు తన సేవలను గుర్తించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు డిఇఓ ఎంపిక చేశారనిఅవార్డు గ్రహీత పుణ్య మంతుల అర్జునరావు అన్నారు.ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, డిఇఓ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డు తనకు జన్మనిచ్చి, చదువు నేర్పించిన తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులు అందరికీ అంకితం ఇస్తున్నానని ఆయన అన్నారు. **రాజోలు:** మలికిపురం ఎమ్‌విఎన్, జెఎస్, ఆర్‌విఆర్., డిగ్రీ కళాశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని బిఎ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపల్ ఎన్.ఆనంద మహనితో పాటుగా పలువురు వక్తలు ప్రసంగించారు.తర్వాత అధ్యాపకులను విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చిట్టాల సత్యనారాయణ, పీడీ పిడికె.ప్రసాద్, ఐక్యూఎసి కోఆర్డినేటర్ పి.సూర్యనారాయణరాజు, ఎన్.రమేష్ బాబు, ఎన్.ప్రభాకర్, రుద్రరాజు రామకృష్ణంరాజు, తోలేటి వీరాంజనేయులు, కడలి శ్రీనివాస్, మనస్సే తదితరులు పాల్గొన్నారు. చింతలపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉత్తమ ఉపాధ్యాయులు, రెడ్ క్రాస్ అవార్డు గ్రహీత గుబ్బల రంగారావు మాస్టారు జ్ఞాపకార్థం ఆయన శిష్యులు ఏర్పాటు చేసిన విగ్రహాన్నిమాజీ డిప్యూటీ స్పీకర్ అల్లూరి వెంకట సూర్యనారాయణ రాజు చేతులు మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో చింతలపల్లి గ్రామ సర్పంచ్ మట్టా ప్రసన్న కుమారి సురేష్, గ్రామ పెద్దలు దంతులూరి చంటిబాబు, దంతులూరి పెదబాబు, పిగన్నవరం వైస్ ఎంపిపి చెల్లుబోయిన గంగా దేవి, మాజీ సర్పంచ్ గెడ్డం సత్యనారాయణ, చింతపల్లి హైస్కూల్ హెచ్.ఎం దొంగ జానకీ రామయ్య, తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహిచిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించడంతో పాటు ఉత్తమ పాఠశాలలకు రోలింగ్ షీల్డ్ లను అందజేశారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి గెడ్డం సంపదరావు, సర్పంచ్ ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, సర్పంచ్‌లు ఇసుకపట్ల జయమణి, జొన్నాడ శ్రీదుర్గ, జిన్నూరి వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు:** మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ ఆదర్శ పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు కె.నాగరాణి అమలాపురం కలెక్టరేట్ నందు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. దీంతో ఉపాధ్యాయ సంఘాలు ఆమెను అభినందించారు. లమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నల్లమిల్లి సురేష్ రెడ్డి రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకునిగా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. మండలంలోని పెనికేరు జై శంకర ప్రయివేటు స్కూల్ ఫౌండర్ మాస్టర్ కుడిపూడి వెంకటరమణమూర్తి విగ్రహావిష్కరణ కార్యక్రమంపూర్వపు విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి టిడిపి నాయకులు ఈదర చిన్నబాబు అధ్యక్షత వహించగా, రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మేక రాంబాబు, నేతలు గొడవర్తి భాస్కరరావు, కోన శ్రీనివాస్, పూర్వపు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **రావులపాలెం:** పొడగట్లపల్లి లక్ష్మీపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని అంగన్ వాడీ కార్యకర్త సంకు శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో తల్లులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్


రామచంద్రపురం మోడరన్ విద్యాసంస్థల వద్ద టీచర్స్ డే నిర్వహిస్తున్న లయన్ జివి.రావు


అమలాపురం వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్‌ను సత్కరిస్తున్న సర్పంచ్‌లు


పెనికేరులో వెంకటరమణమూర్తి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సిఐ,ఎస్ఐ తదితరులు

కార్టూ'నిజం'



గ్రోయిన్ల నిర్మాణానికి నిధుల మంజూరు

- రాజోలు ఎంఎల్ఎ దేవవరప్రసాద్
- ప్రజాశక్తి కథనానికి అధికార యంత్రాంగం స్పందన

ప్రజాశక్తి - రాజోలు

ఏటిగట్లను అభివృద్ధి చేసి నదీకోత నివారణకు గ్రోయిన్లు నిర్మించేందుకు రూ.10 కోట్ల నిధులు మంజురు అయ్యాయని రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ తెలిపారు. మరో పది రోజులలో ఈ పనులకు భూమి పూజా చేయనున్నట్లు ఆయన పేర్కొ న్నారు. ఈనెల 2న వరద గండమే...! బలహీనంగా ఏటిగట్లు' శీర్షికన కథనం 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన విషయం విదితమే. ఆ కథనానికి స్పందించిన రాజో లు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ శుక్రవారం రాజోలు మండలంలోని ఏటి గట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. పి.గన్నవరం డొక్కా సీతమ్మ అక్వి డక్టుకు దిగువన ఉన్న పి.గన్నవరం మండలంలోని నాలుగు గ్రామాలు, మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాలను రాజోలుదీవిగా వ్యవహరిస్తారు. ఈ దీవికి రక్షణ కవచంలా వశిష్ట ఎడమ, వైనతేయ కుడిఏటిగట్లు ఉన్నాయి. ఏటిగట్లకు గండిపడి వరదనీరు పోటెత్తడం తదితర ఘటనలు మరలా పునారవృతం కాకుండా చర్యలు చేపడతామని ఎంఎల్ఎ హామీ ఇచ్చారు. గోదావరి నదీతీర ప్రాంతంలో నదీ కోత నివారణకు చర్యలు తీసుకునేలా నదీ కోతనివారణకు గ్రోయిన్ల ఏర్పాటుకు సంబంధిత అధికారులతో ప్రతిపాదనలు సిద్ధంచేశారు. రూ.10 కోట్లతో గ్రోయిన్లు నిర్మాణం చేపట్టనున్నట్లు ఎంఎల్ఎ తెలిపారు. దీంతో ఏటా రాజోలు సమీపంలో నదీ కోతకు లంక భూములు నదీగర్భంలో కలిసిపోకు ఒడా ఉంటుంది. రూ.7 కోట్లతో రెండు కిలోమీటర్ల మేర ఏటిగట్టును పరిష్టం చేసేలా ప్రతిపాదనలు చేసి ఉన్నతాధికారులకు, ప్రభుత్వ యంత్రాంగానికి పంపి నట్లు ఎంఎల్ఎ తెలిపారు. ప్రజాశక్తి కథనంతో ప్రభుత్వ యంత్రాంగం కదలి రావడంతో స్థానికులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రజాశక్తి పత్రికకు ధన్యవాదాలు తెలిపారు.


అధికారులతో కలిసి ఏటిగట్లను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

నానో ఎరువులతో పంటలకు మేలు : ఎడిఎ

ప్రజాశక్తి - రామచంద్రపురం

నానో ఎరువుల వాడకం వలన పంటలకు అనేక లాభాలు చేకూరుతాయాని రామచంద్రపురం ఏడిఏ బి.నాగ కుమార్ తెలిపారు. స్థానిక కుందూరు గ్రామంలోని సహకార సంఘ ఛైర్మన్ జె. వెంకట రమణ రావు అధ్యక్షతన రైతులతో నిర్వహించిన నానో ఎరువుల అవగాహనా సదస్సులో అయన మాట్లాడుతూ, రైతులందరు తప్పకుండ నానో ఎరువులను ఉపయోగించేలా సహకరించాలని, రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూమి దెబ్బతింటుందని, రైతుకు కూడా ఖర్చు పెరిగిపోతుందని తెలిపారు. నానో ఎరువులు అద్భుతంగా పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కె.గంగవరం మండల వ్యవసాయ అధికారి ఏ.సద్గురు మూర్తి మాట్లాడుతూ పై న వేసుకునే యూరియాకు బదులు నానో ఎరువులను ఉపయోగించడం ద్వారా రైతులు ఖర్చు తగ్గించుకొని నాణ్యమైన దిగుబడులు పొందవచ్చునని, తద్వారా యూరియా అధిక వినియోగాన్ని నివారించవచ్చు అని తెలిపారు. ఇఫ్కో జిల్లా మేనేజర్ గుంటక శ్యామ్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ నానో ఎరువులను సులభంగా పిచికారీ చేయుట కొరకు డ్రోన్ ను ఇఫ్కో సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. అతి తక్కువ ధరలో పిచికారీ చేసేలా ప్రణాళికలు చేశామని తెలిపారు. ఇప్పటికే అనేక గ్రామాలలో నానో యూరియా ట్రయిల్స్ నిర్వహించామని, బస్తాకు సమానమైన నానో యూరియా కేవలం రూ.225, నానో డిఎపి రూ.600 మాత్రమే అని తెలియజేశారు. ఇఫ్కో యొక్క ప్రతి ఎరువుల బస్తా లేదా నానో బాటిల్ కొనుగోలు పై గరిష్టంగా రూ. రెండు లక్షల వరకు బీమా కూడా ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు బాబి, కొరిపల్లి సురేష్, కుందూరు సహకార సంఘ కార్యనిర్వాహణ అధికారి పిఎస్‌విఎన్‌ఎస్.బాబు, ఎఇఓ హేమంత్, విఎఎ రేవతి, నాని బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవామృతంతో నత్రజని లోపాల నివారణ

ప్రజాశక్తి - మామిడికుదురు

జీవామతం వినియోగంతో నత్రజని లోపం భర్తీ అయ్యి పంటలకు ఎంతో మేలు చేకూరుతందని యూనిట్ ఇన్‌ఛార్జి కుడిపూడి జానకి తెలిపారు. ఈదరాడ బిఆర్‌కె సెంటర్లో ఐసిఆర్‌పి చెల్లిబోయిన రాధ, డిఎంఎం టి.కుసుమ పద్మ 45 లీటర్ల జీవామృతం, 700 మిల్లి టర్ల మీనామృతం తయారు చేశారు స్థానిక రైతు ఎరుబండి లక్ష్మయ్య 3.50 ఎకరాల విస్తీర్ణంలో పంటలకు నత్రజని లోపం నివారణకు వినియోగించారు ఎకరాకు పదిహేను లీటర్ల జీవామతం, 200 ఎంఎల్ మీనామతం కలిపి పిచికారీ చేయాలన్నారు ఈ విధంగా చేయడం వల్ల నత్రజని లోపం తగ్గుతుందన్నారు. పంటలు సమృద్ధిగా ఎదిగి మంచి దిగుబడులు వస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చు అని ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఎఓ ఎంవివి.సత్యనారాయణ తెలిపారు

నేరాలు ఘోరాలు

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

ప్రజాశక్తి - రాజోలు

ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల్లో వివిధ జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం రాజోలు సర్కిల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వివరాలను రాజోలు సిఐ టివి.నరేష్‌కుమార్, అమలాపురం క్రైమ్ సిఐ గజేంద్రకుమార్ వెల్లడించారు. కొత్తపేట డిఎస్‌పి సుంకర మురళీ మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు దొంగతనాలపై నిఘా పెట్టి వరుస చోరీలకు పాల్పడుతున్న రాజోలు మండలం బి.సావరం గ్రామానికి చెందిన కట్టా అర్జున్, ఏలూరుకు చెందిన సోదెం మంగ ప్రసాద్, రాజమండ్రికి చెందిన షేక్ బాష, కాకినాడ కు చెందిన షేక్ అజీజ్‌లను అరెస్టు చేశారు. వీరి నుంచి 64 గ్రాముల బంగారం, రెండు కేజీల వెండి, రూ.2.80 లక్షల నగదు మొత్తం రూ.11,58, 500 విలువ చేసే సొత్తు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై రాజోలు పోలీస్ స్టేషన్లో 3, తూర్పుగోదావరి జిల్లాలో 1, ఏలూరు జిల్లాలో 4, తెలంగాణ రాష్ట్రంలో 1 కేసుల నమోదు అయ్యి ఉన్నాయి. వీరిలో కట్టా అర్జున్‌పై పదికి పైగా దొంగతనం కేసులు ఉన్నాయి. వీరంతా వివిధ దొంగతనాల కేసుల్లో జైలు కు వెళ్లినపుడు అక్కడ పరిచయం అయ్యి బయటకు వచ్చిన తర్వాత చెడు వ్యసనాలకు బానిసలై మరలా దొంగతనాల బాట పడుతున్నారని పోలీసులు తెలిపారు. ఈ చోరీ కేసును చాకచక్యంగా చేధించిన రాజోలు సిఐ నరేష్ కుమార్, అమలాపురం క్రైమ్ సీఐ గజేంద్రకుమార్, ఎస్‌ఐలు రాజేష్‌కుమార్, పరదేశి, ఎఎస్‌ఐ బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుల్లు శేఖర్ రాజు, కోళ్ల వెంకట రమణ, కానిస్టేబుళ్లు అర్జున్, ఎం.హరిబాబు, గుబ్బల సాయి కృష్ణ, బి.ప్రసాద్, ఎ.సుధాకర్, ఎల్.శ్రీను, ఆర్.ప్రసాద్, ఎం.రమేష్, కిషోర్, రెడ్డి, ఆర్. శ్రీనులను జిల్లా ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి- తాళ్లరేవు

నీలపల్లిలోని వికాస్ లేఔట్‌లో జూన్ 12న ఒక ఇంటిలో జరిగిన చోరీ కేసులో పలివెల చరణ్‌ను శుక్రవారం అరెస్ట్ చేసినట్టు కోరంగి ఎస్‌ఐ పి.సత్యనారాయణ తెలిపారు. అతడి వద్ద నుంచి రూ.2 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులు రికవరీ చేశామన్నారు. అతడిని కోర్టులో హాజరు పరిచామన్నారు.

బి.కొత్తూరు ఘటనపై అట్రాసిటీ కేసుల నమోదు

ప్రజాశక్తి-పిఠాపురం

మండలంలోని బి.కొత్తూరులో వినాయక నిమజ్జనం వేడుకల్లో జరిగిన ఘటనపై అట్రాసిటీ కేసు నమోదు చేశామని రూరల్ ఎస్‌ఐ జాన్ బాషా తెలిపారు. చెల్లి గణేష్, మరో వర్గానికి చెందిన బొంగులూరి పవన్ కుమార్ తమపై దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని ఫిర్యాదులు చేశారన్నారు. బి కొత్తూరు గ్రామాన్ని ఎఎస్‌పి మనీష్ దేవరాజ్ పాటిల్ సందర్శించారు. ఇరు వర్గాలు చేసుకున్న ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. 9 మందిపై అట్రాసిటీ కేసులు నమోదు చేశారు.

పాఠశాలలో వంట షెడ్డు ప్రారంభం

ప్రజాశక్తి - అయినవిల్లి

మండలంలోని నేదునూరు పెదపేట ఎంపిపి మోడల్ పాఠశాల నందు స్థానిక ఎంపిటిసి సభ్యులు ఇండుగుల వెంకట్రామయ్య ఆర్థిక సహకారంతో వంట షెడ్డును నిర్మించారు. శుక్రవారం స్థానిక సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, ఎంఇఒ మేల్లం శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆయన వంట షెడ్డును ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఇండుగుల వెంకట్రామయ్యను, బదిలీపై వెళ్లిన పాఠశాల ప్రధానోపా ధ్యాయులు ఎం.రామకృష్ణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు కె. సుబ్బ రాజు, మాజీ ఎంపిపి జి.వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు మోత వెంకటేశ్వరరావు, గోకరకొండ సత్య నారాయణ, జి.శ్రీనివాస్ పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికోసమే వైసిపి ఆందోళనలు

ప్రజాశక్తి - కొత్తపేట

ప్రభుత్వం పారదర్శకంగా యూరియా సరఫరా, పంపిణీ చేస్తున్నా రాజకీయ లబ్ధి కోసమే వైసీపీ ఆందోళనలు చేపడుతోంది అని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి విమర్శించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గత వైసిపసి ప్రభుత్వంలో కన్నా ఎక్కువ యూరియాను కూటమి ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా పంపిణీ చేస్తోందని, ఇ-కెవైసి పూర్తయిన రైతులకు అన్నదాత సుఖీభవ నగదును ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి ఒక్కరికి అవసరమైనంత యూరియా సమయానికి అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలుచేపట్టిందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో యూరియా సరఫరా, పంపిణీ వ్యవస్థను పర్యవేక్షిస్తూ, ఎక్కడా కొరత తలెత్తకుండా ప్రభుత్వం తగినన్ని నిల్వలు సిద్ధం చేసిందన్నార.. ఎటువంటి అవకతవకలు లేకుండా రైతులకు నేరుగా యూరియా చేరేలా చర్యలు చేట్టిందన్నారు. కేంద్రం సహకారంతో రాష్ట్రంలో యూరియా సమృద్ధిగా లభ్యమవుతోంది, అసత్య కథనాలు, మాటలతో వైసిపి నేతలు రైతులను మభ్య పెట్టాలని చూస్తున్నారని ఆయన విమర్శిం:చారు. రాష్ట్రంలో యూరియా సరఫరా, పంపిణీ విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేక పోవడం వలనే, రాష్ట్రంలో ఎక్కడ నిరసనలు లేవని గ్రహించాలని, వైసిపి నాయకులు వాస్తవాన్ని గ్రహించి రైతులను తప్పుదోవ పట్టించే చర్యలు మానుకోవాలన్నారు.

వాసాలరేవులో అన్నదానం

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని వాసాల రేవు మత్స్యకార కాలనీలో శుక్రవారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పెద్దలు దోమ ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో సుమారు 3,000 మంది భోజనాలు ఏర్పాటు చేశారు. గ్రామంలోని వినాయక కమిటీ, యువజన సంఘం సంఘం నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం

- కార్యక్రమాల్లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులు
- అవార్డు గ్రహీతలకు పలువురి అభినందన


కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చేతులమీదుగా అవార్డు స్వీకరిస్తున్న భట్నవిల్లికిచెందిన ఉపాధ్యాయుడు అర్జునరావు


అవార్డు స్వీకరిస్తున్న ఆలమూరు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ సురేష్ రెడ్డి


ఆలమూరు ఎంపిపి ఆదర్శ పాఠశాల హెచ్‌ఎం కె.నాగరాణి


ఉప్పలగుప్తంలో ఉపాధ్యాయులకు సత్కారం


ద్రాక్షారామం జడ్‌పి హైస్కూల్లో సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహావిష్కరణలో ఎంపిపి భవాని



అమలాపురం వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో వైస్‌ఛైర్మన్ ప్రవీణ్‌కు సన్మానం

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులు, అధ్యాపకులుగా ఎంపికైనవారికి అవార్డులు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ద్రాక్షారామంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కళాశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్స్ డే నిర్వహించారు.



పొడగట్లపల్లి అంగన్‌వాడీకేంద్రంలో ఉపాధ్యాయుల దినోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి పాల్గొన్న సిఐ, ఎస్‌ఐలు తదితరులు

నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - అంబాజీపేట

వర్షాలు, వరదల నేపథ్యంలో చెరువులు, నదీ ప్రవాహాలు ఎక్కువగా ఉన్నందున గణపతి విగ్రహాల నిమజ్జన సమయంలో ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉత్సవ కమిటీలు జాగ్రత్తలు పాటిం చాలని కొత్తపేట డిఎస్‌పి సుంకర మురళీమోహన్ అన్నారు. డిఎస్‌పి ఆధ్వర్యంలో అంబాజీపేట వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో సిఐ ఆర్.భీమరాజు అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి ఉత్సవ కమిటీ సభ్యులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. నిమజ్జన ప్రదేశాలలో చిన్న పిల్లలు, మహిళలను తీసుకురాకుండా ప్రభుత్వ అధికారుల సూచనల మేరకు జాగ్రత్తగా పాటించాలని డిఎస్‌పి సూచించారు. పోలీసులకు సమాచారం తెలియపరచ కుండా నిమజ్జనం, ఊరేగింపు ఎట్టి పరిస్థితులలో జరపరాదని పి.గన్నవరం సిఐ రుద్దరాజు భీమరాజు సూచించారు. ఉత్సవ కమిటీ ముందుగా తీసుకున్న అనుమతుల ప్రకారం తెలియ పరచిన సమయం ఊరేగింపు మార్గం నిర్ణయించిన మార్గం లోనే వెళ్లాలన్నారు. మత్తు పానీయాలు తాగి నిమజ్జనం ఊరేగింపులలో పాల్గొనరాదని అట్టి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళా పోలీసులు సాయంత్రం ఏడు గంటల వరకు నిమజ్జన కార్యక్ర మం విధుల్లో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో అంబాజీపేట,పి.గన్నవరం, మామిడి కుదురు, అయినవిల్లి ఎస్‌ఐలు కె.చిరంజీవి, బి.శివకృష్ణ, ఎ.చైతన్యకుమార్, హరికోటి శాస్త్రి, ట్రైనింగ్ ఎస్‌ఐలు, ఎఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

5కె రన్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

వ్యాధులపై అవగహన కలిగిస్తూ జిల్లా స్థాయి మారథాన్ 5కె రన్ పోటీలను విజయవంతం చేయాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ , టిబి వ్యాధుల పర్యవేక్షక అధికారిని డాక్టర్ సిహెచ్.భరతలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా యువతలో హెచ్‌ఐవి/ఎయిడ్స్ వ్యాధులతో పాటు మాధకద్రవ్యాల నియంత్రణ కలిగిస్తూ సెప్టెంబర్ 9 న ముమ్మిడివరంలో జరగనున్న మారథాన్ 5 కె రన్ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రయివేటు డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు పాల్గొనాలన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ 5 కెరన్ పోటీల లో గెలుపొందిన మొదటి విజేతకు రూ.10వేలు, రెండవ విజేతకు రూ.7వేలు నగదు ప్రోత్సాహం అందిస్తారని అన్నారు. ఈ పోటీలు స్త్రీ/ పురుషులకు వేరు వేరుగా నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ ఫోన్ నెం.9000397803 ను సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

నేడు కామనగరువులో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం మండలం కామనగరువు రాజులపూడి వెంకటేశ్వరరావు కాలనీ విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద అమలాపురం రోహిణి తల్లి, పిల్లల ఆసుపత్రి ఆధ్వర్యంలో నేడు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ నక్క అరుణకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ప్రముఖ చిన్న పిల్లలు వైద్య నిపుణులు డాక్టర్ విఎస్ఎస్ఎన్.మూర్తి (రోహిణి డాక్టర్) చిన్న పిల్లలకు పుట్టిన పిల్లల నుంచి 15 సంవత్సరాల వరకు అన్ని రకముల ఆరోగ్య సమస్యలను పరీక్షించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. స్త్రీ, ప్రసూతి, స్కానింగ్, సంతాన సాఫల్య కేంద్ర వైద్య నిపుణులు డాక్టర్ వి.శారద (రోహిణి మేడం) గర్భిణులకు, స్త్రీల యొక్క అన్ని రకముల ఆరోగ్య సమస్యలకు పరీక్షించి ఉచితం గా మందులు అందజేస్తారన్నారున ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు వినియోగించు కోవలసిందిగా సర్పంచ్ కోరారు. వివరాలకు పిఆర్ఒ ఎ.శ్రీనివాసరావు 917770710ను సంప్రదించాలన్నారు.


పరిశీలిస్తున్న సర్పంచ్ సునీత

బండారులంకలో పలు అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

బండారులంక నక్కావారిపేటలో పలు అభివృద్ధి పనులను గ్రామ సర్పంచ్ పెనుమాల సునీత పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జలజీవన్‌మిషన్‌లో భాగంగా ఇంటింటి కుళాయి పనులను త్వరిత గతిన పూర్తి చేసి సకాలంలో ప్రజలకు నీరు అందించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అలాగే వాటర్ ట్యాంకు వద్ద జరుగుతున్న రిపేరు పనులను పరిశీలించారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రం నందు నిర్మిస్తున్న కిచెన్ గార్డెన్ పనులను పరిశీలించారు. పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం పౌష్టిక ఆహారం అంది స్తుందని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు.

7న బాల బాలాజీ ఆలయం మూసివేత

ప్రజాశక్తి - మామిడికుదురు

సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి ఆలయాన్ని ఈనెల 7న ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి మూసి వేస్తున్నట్లు సహాయ కమిషనర్ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఆలయాన్ని సంప్రోక్షణ చేసిన అనంతరం ఉదయం 10 గంటల నుంచి స్వామి వారి దర్శనాలు యథావిధిగా జరుగుతాయన్నారు. యాత్రికులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కాట్రేనికోన

విద్యుత్‌లైన్‌ల్లో మరమ్మతుల కారణంగా నేడు శనివారం సరఫరాకు అంతరాయం కలుగు తుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కాట్రేనికోన సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. పల్లంకూరు నూతన సబ్ స్టేషన్ పనుల నిమిత్తం ఈ అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్తు లైన్లో మరమతులు వంటి పనులు చేపట్టడతామన్నారు.

ఎగ్ కార్ట్‌తో మహిళలకు ఉపాధి

ప్రజాశక్తి- రాజోలు

డ్వాక్రా మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ఎగ్ కార్ట్‌ల వినూత్న పథకానికి శ్రీకారం చుట్టిందని రాజోలు ఎంపిపి కదలి శ్రీ దుర్గా అన్నారు. శుక్రవారం రాజోలు మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రూ.50 వేలు విలువైన ఎగ్‌కార్ట్‌లను సాయి సునంద డ్వాక్రా గ్రూపునకు చెందిన కాళ్ళ రామలక్ష్మికి ఆమె అందజేశారు. గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్,చాగంటి స్వామి,ఎపిఎం వర్మ,కాట్న రాజు,కోళ్ల బాబీ,దారపురెడ్డి బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలపై వివాదాస్పద రాతలను అరికట్టాలి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ప్రశాంతంగా ఉండే గ్రామాలలో వివాదాస్పద రాతలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి వివాదాలకు కారణం అవుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జెఎసి నాయకులు శుక్రవారం ఎంపిడిఒ భూపతిరాజు తులసి కృష్ణకు వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో ఘర్షణలు జరిగే ప్రమాదం ఉందని ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల వద్ద బోర్డు లపై తప్పనిసరిగా జిల్లా పేరు రాసేటప్పుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అని రాసి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులు కూడా వారు ప్రింట్ చేసే వాటిపై అడ్రస్ ముద్రించేటప్పుడు తప్పనిసరిగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పేరు ప్రింట్ చేసే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వైస్ ఎంపిపి సాదే శ్రీనివాసరావు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, మాజీ సర్పంచ్ గెడ్డం సురేష్ బాబు, జెఎసి నాయకులు కుంచే బాబులు, దేవరపల్లి రాంబాబు, గుంట్రు చిట్టిబాబు, దేవరపల్లి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

గౌరీ లంకేష్ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మానవ హక్కుల కార్యకర్తగా, మతోన్మాద శక్తులపై అవిశ్రాంతం పోరాడిన పత్రికా సంపాదకురాలు గౌరీ లంకేష్ ఆశయ సాధనకు కృషి చేయాలని రాజ్యాంగ పరిరక్షణ సమితి పేర్కొంది. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు ఆవరణలో శుక్రవారం శరత్ ఆధ్వర్యంలో కన్నడ పత్రికా సంపాదకురాలు గౌరీ లంకేష్ 8వ వర్ధంతి సభ జరిగింది. తొలుత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి, హేతువాద పత్రికా సంపాదకురాలు గౌరీ లంకేష్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పలువురు వ్యక్తులు మాట్లా డుతూ లంకేష్ మానవ హక్కుల కోసం, మతోన్మాద శక్తులపై పోరాటం చేయడమే కాకుండా, ప్రజల్లో మార్పు కోసం పత్రికను స్థాపించారన్నారు. ఈ కార్య క్రమంలో పి.సుధీర్, ఎం.ఆశీర్వాదం, ఐ.పాపారావు, టి.దుర్గబాబు, పి.శ్రీనివాస్, బి.సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర సాధకు కృషి చేయాలి

ప్రజాశక్తి - అమలాపురం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ఆనందరావు

స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రను సాదించడానికి వార్డు సభ్యులు అందరూ కృషి చేయాలని, ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణ, చెత్త రహిత పట్టణం కొరకు కృషి చేయాలని ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో సాహాస్ వాష్ ఇన్స్టిట్యూట్ సంస్థల వారిచే అమలాపురం పురపాలక సంఘ ఛైర్మన్, వైస్ ఛైర్మనులు, వార్డు సభ్యులు కో-ఆప్షన్ సభ్యులకు సుస్థిర ఘన వ్యర్థాల నిర్వహణ వినియోగించిన నీటి నిర్వహణపై అవగాహన కార్యక్రమం పట్టణంలోని హోటల్ గ్రాండ్ పార్కు నందు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా శాసన సభ్యులు అయితాబత్తుల ఆనందరావు, శాసన మండలి సభ్యులు కుడుపూడి సూర్యనారాయణ విచ్చేశారు. కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణ, చెత్త సేకరణ, పునర్వినియోగంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించడం, వ్యర్థాల నిర్వహణకు సంబందించి చట్టాలపై అవగాహన కల్పించడం సంతోషదాయకమని తెలియజేశారు. వాష్ సాహాస్ సంస్థలకు చెందిన సీనియర్ శిక్షణా నిపుణులు ప్రణాళిక గురించి సమగ్రంగా వార్డు సభ్యులకు వివరించి, అవగాహన కల్పించి, శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ , మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి , వాష్ సాహాస్ సంస్థల టెక్నికల్ శిక్షణా నిపుణులు వి.శశాంక్, ఎస్.రఘు, ఏంజెల్, అర్జున్ ప్రసాద్, శ్రీమ, సిహె చ్‌విఎస్.అనూష మౌనిక తదితరులు పాల్గొన్నారు.

జడ్‌పి హైస్కూల్‌కు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి-కాజులూరు

జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ఇటీవల రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు లభించడం గర్వించదగిన విషయమని గొల్లపాలెం జెడ్‌పి స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు జి.సునీల్ కుమార్ అన్నారు. ఇది ఒక బహుమతి మాత్రమే కాక విద్యార్థుల క్రీడా ప్రతిభకు, గురువుల నిబద్ధతకు, సిబ్బంది సమిష్టి కృషికి గుర్తింపుగా నిలిచిందన్నారు. విద్యార్థులు అథ్లెటిక్స్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, తైక్వాండో వంటి రంగాల్లో రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదిగి పతకాలు సాధించడం ప్రధాన కారణంగా నిలిచిందని తెలిపారు. ఉపాధ్యాయులను తహశీల్దారు రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపిడిఒ రాంబాబు, ఎంఇఒలు డేవిడ్, జాన్, వ్యవసాయ అధికారి అశోక్, నాయకులు తాడి వెంకటరెడ్డి, దేగల వెంకట సతీష్, దేగల నాగేంద్ర, అన్యం శ్రీరామచంద్రమూర్తి అభినందించారు.

సావిత్రీబాయి పూలేకు భారతరత్న ఇవ్వాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

సావిత్రీబాయి పూలేకు భారతరత్న ఇవ్వాలని నియోజకవర్గ మైనారిటీ బిసి సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురుపూజోత్సవ దినోత్సవం సందర్భంగా ద్రాక్షారామంలో భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయు రాలు, మహాత్మా జ్యోతిరావు పూలే భార్య సావిత్రీబాయి పూలేకు యాట్ల నాగేశ్వరరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. యాట్ల నాగేశ్వరరావు భార్య., మత్స్యకార మహిళా సహకార సంఘం అధ్యక్షురాలు, న్యాయవాది. యాట్ల రోజా రాణిలో కలిసి మసీదు సెంటర్ లో ఉన్న మహాత్మా పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నాగేశ్వరారావు మాట్లాడుతూ పూలే దంపతుల త్యాగానికి కేంద్ర ప్రభుత్వం తక్షణం స్పందించి సావిత్రీబాయి పూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలని, ఆమెకు అత్యంత ప్రతిష్టాత్మకమైన భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం భారతరత్న ఇవ్వాలని ప్లకార్డు లను ప్రదర్శించారు.